
# మా ఆంధ్రా అన్నపూర్ణ!

— నల్లగట్ల సువర్ణా సాయిరాం



అప్పటికి పదిసార్లయినా అని వుంటాది నా భార్య ప్రసన్న, "ఈ పాసింజర్ రైలు ఎక్కించారు, ఇది ఏ రోజుకు వూరికి చేరుస్తుందో మనల్ని!"– అని.

మొదట్లో "ఈ రోజు కాదు రేపు" అని వేళాకోళం చేసినా, అదే పనిగా అంటుండేసరికి సీరియస్‌గా చూడడం మొదలుపెట్టాను. నా మొహం చూసి ఏమనుకుందో, మరి మాట్లాడకుండా పుస్తకాలు చదవుకుంటూ కూచుంది.

నా స్నేహితుడి చెల్లెలి పెళ్ళి మా స్వగ్రామంలో. ఉద్యోగం చేస్తూ మా వూరికి దూరమైనందువల్ల, ఎప్పుడూ మా ఆవిడ ఆ వూరు చూడని కారణం వల్ల భార్యా పిల్లల్ని తీసుకుని బయల్దేరాము. పల్లెల్లో గడిచిన బాల్యం గురించి వేరే చెప్పక్కరలేదు. చక్కని అనుభూతుల్ని, మళ్ళీ మా వాళ్ళతో కలిసి పంచుకోవడంతోపాటు సిమెంటు గోడల మధ్య ప్లాస్టిక్ ఇండోర్ ప్లాంట్స్‌లో బతుకుతున్న మా పిల్లలకి చక్కని చేలూ, పిల్లకాలువలూ, తోటలూ చూపించాలనుకున్నాను. పాసింజర్ రైల్లో ప్రయాణం చేస్తే పచ్చని పంట పొలాల మధ్య వెళ్ళే ఆ ప్రయాణం ఎంతో బావుంటుందని చెప్పి, వాళ్ళని బయల్దేరతీశాను.

అయితే, ప్రసన్నకేమాత్రం ఈ రైలు ప్రయాణం నచ్చలేదు. టాక్సీ మాట్లాడుకుని వెళ్తే నాలుగు గంటల ప్రయాణం, పాసింజర్ రైల్లో ఎనిమిది గంటల ప్రయాణం! అందుకే ఈ సణుగుడు. ఇప్పటికి నాలుగు గంటల ప్రయాణం గడిచింది. ఇంకా రెండు, మూడు గంటలు పడుతుంది ఈ రైలు మా వూరు చేరేసరికి. అన్ని స్టేషన్‌లలోనూ ఆగుతూ నత్తనడకతో నడుచుకుంటూ పోతూంది. పిల్లలిద్దరూ ఇప్పటి వరకూ కిటికీ పక్కన చేరి ఉత్సాహంగా చూసినవాళ్ళు ఇంక చూడలేక బిస్కెట్లు తిని నిద్రపోయారు.

ఒక పొడవు సీటులో కిటికీ దగ్గర నేనూ, పిల్లలూ సీటు చివర ప్రసన్న కూచున్నాము. మా ఎదురు సీటులో ఒక రైతు కుటుంబం. భార్య, భర్త, ముగ్గురు పిల్లలూ. ఒక పెద్ద గిన్నెడు అన్నం వండుకొచ్చింది ఆవిడ, అందులోకి ఏదో కారం పచ్చడి తెచ్చింది. ఒక కారేజీలో మజ్జిగ పోసుకొచ్చింది. పిల్లలకి ఆకలన్నప్పుడల్లా, ఒక చిన్న గిన్నెలో కాస్త పచ్చడో, మజ్జిగో వేసి పెడుతూంది. ఆ పిల్లలు తినడం పడుకోవడం. మా పిల్లలు తింటూ బిస్కెట్లూ పళ్ళూ పెడితే తీసుకున్నారు. మా పిల్లలిద్దరూ చివరగా బ్యాగ్ దులిపి ఖాళీ చేసేశారు. ఎలాగూ వూరు దగ్గర కొచ్చిందని మా ఆవిడ అన్నీ సర్దేసింది.

ప్రసన్నకి రైలెక్కిన దగ్గర్నించి కూడా ఎదురుగా కూచున్న ఆ కుటుంబం నచ్చలేదు. ఆ పిల్లలు అన్నం తినడం, ఆ ఎంగిళ్ళు కిందపడడం, అవి మా పిల్లలూ, ఆ పిల్లలూ తొక్కడం, పెట్టిందే తడవుగా వాళ్ళు ఆత్రంగా తినడం సహించలేకపోతూంది. తన పిల్లలకి షోగ్గా బిస్కెట్లూ పళ్ళూ పెడుతుంది. అందుకని వాళ్ళని చూసి ముఖం చిట్లించుకోవడం చూస్తుంటే నాకు నవ్వు వస్తోంది. ఒక రకంగా ఆకలి తీరడానికి పిల్లలకి గడ్డి గాదం పెట్టకుండా శుభ్రంగా అన్నం తినిపించే ఆవిడని చూస్తే, నాకు సంతోషమే కలిగింది. వాళ్ళు ఏవో మాటలు కలపబోయారు కానీ, ప్రసన్న కల్పించుకోకపోవడం చూసి ఆగిపోయారు. నేను కూడా వాళ్ళని గమనించడమే కానీ మాటలు కలపలేదు.

ఇంక మా వూరికి మధ్యలో నాలుగు స్టేషన్లున్నాయనగా ఒక పల్లె స్టేషన్‌లో రైలాగింది. ఎంతకీ కదలడం లేదు. కిందికెళ్ళి చూసి వద్దామని దిగి వెళ్ళాను. బాగా చిన్న స్టేషనది. స్టేషన్ మాస్టరి దగ్గరకెళ్ళి అడిగాను.

ముందు వెళ్ళిన ఒక గుడ్స్ బండి పట్టాలు తప్పిందనీ, అటునుంచి రైల్వేవాళ్ళు వచ్చి దారికి అడ్డం తీస్తే గాని, ఆ సింగిల్ లైన్లో రైలు వెళ్ళడానికి వీల్లేదనీ, ఒక రెండు మూడు గంటలు పట్టవచ్చని చెప్పాడు. ఆ వూర్నించి ఏమన్నా కార్లుంటే పోవచ్చునేమోనని వాకబు చేశాను.

అసలు స్టేషన్నుంచి వూర్లోకి ఒక మైలు దూరమనీ, ఎడ్ల బళ్ళు తప్ప ఏ ప్రయాణ సాధనాలు వుండవనీ తెలుసుకుని బుద్ధిగా రైలెక్కి కూచున్నాను. 'నేను చెప్తే విన్నారా' అన్నట్లు నా వైపు చూస్తున్న ప్రసన్న కోసం చూపులు తప్పించుకుంటూ, పిల్లలు లేవడంతో వాళ్ళిద్దర్నీ తీసుకుని కిందికి దిగాను.

పిల్లలిద్దరికీ ఏమన్నా కొందామన్నా చిన్నబడ్డీకొట్టు కూడా లేదు ఆ

తెలుగు కళాసమితి, బహ్రెయిన్ – రాజ్యలక్ష్మి ఫౌండేషన్ కథల పోటీలో
తృతీయ బహుమతి రూ. 1000/– పొందిన కథ



స్టేషన్‌లో. కాసేపు పిల్లలిద్దరూ అటూ ఇటూ తిరిగి ఆడుకున్నారు. ఆ స్టేషన్‌లో వాటర్ ఫెసిలిటీ కూడా లేదు. సింటెక్స్ ట్రమ్ ఒకటుంది. అందులో కూడా నీళ్లు అడుగున వున్నాయి. ఆ నీళ్లతోనే ముఖాలు కడిగించాను. ప్రయాణీకులందరూ కిందికి దిగి గాలికి అటూ ఇటూ తిరుగుతున్నారు. పిల్లలు సిమెంటు బెంచీల మీద కూచుని ఆడుకున్నారు కాసేపు. రైలు పట్టాల మీద స్వేచ్ఛగా తిరిగారు కొద్దిసేపు. ఇద్దరూ చిన్ని చిన్ని పిల్లికూనల్లా తిరిగారు.

ఆకాశంలోకి నించున్న అపార్ట్‌మెంట్‌లో నించుని కింద రోడ్లమీద తిరిగే కారుల్ని చూస్తూ, ఆ పొగలు పీలుస్తూ బతుకుతున్న మా పిల్లలు గంటసేపు స్టేషన్‌లో చెట్ల కింద హాయిగా ఆడుకున్నారు. "డాడీ, భలే బాగుంది ఇక్కడ" అంటూ రైలెక్కలేదు. చీకటి పడబోతోంది. కిటికీలో మమ్మల్ని చూస్తూ సామాన్లు కాపలా కాస్తున్న ప్రసన్న రమ్మని పిలిచింది.

మళ్లీ స్టేషన్ మాస్టర్‌ని అడిగితే లైన్ క్లియర్ చేస్తున్నట్టు తెలిసిందని ఇంకో రెండు గంటలు పట్టవచ్చని చెప్పాడు.

రైలెక్కగానే పిల్లలిద్దరికీ ఆకలి గుర్తువచ్చింది. బేగ్‌లు తడిమారు బిస్కెట్లన్నీ అయిపోయాయి. కాసేపు దిక్కులు చూసి, మమ్మీనడిగితే తిడుతుందని, నా చెవుల్లో గొణగడం మొదలుపెట్టారు ఆకలని.

ప్రసన్నకి తెలుసు పిల్లలకి ఆకలేస్తోందని. కానీ ఏం పెట్టాలో తెలియడంలేదు. ఉదయం పదిగంటలకు తిన్న అన్నం, ప్రయాణం సందట్లో అసలు తిననేలేదు సరిగ్గా. నేనైతే అంత ఉదయమే తినే అలవాటు లేక తినలేదు. ప్రసన్న ఒక్కపూటే తింటుంది. పిల్లలు పుట్టాక వళ్లు వస్తుందని డైటింగ్ చేస్తోంది. ఊరెళ్లిన రాత్రికి తింటాము కదా అని తినలేదు.

ఎదురు పిల్లలు ఇంకోసారి అన్నాలు తినేసి, సీటు మీద ఇద్దరూ కింద ఒకదూ పాత దుప్పట్లు వేసుకుపడుకున్నారు. ఆ భార్యాభర్తలిద్దరూ కూడా చెరి కాస్త అన్నాలు తిని కూచున్నారు. 'చేతిలో అన్నం వుంది కాబట్టి ఎంత నిశ్చితంగా కూచున్నారు' అనిపించింది. సమయం గడుస్తోంది.

పాప, బాబు ఇంక ఏడుపు లంకించుకున్నారు ఆకలికి. ఇద్దరం వాళ్లని సముదాయించ లేకపోతున్నాము. అంతా చూస్తున్న ఎదురావిడ గిన్నెని శుభ్రంగా కడిగి అన్నం పెట్టి మజ్జిగ పోసి ఇచ్చింది. ప్రసన్న వద్దు వద్దంది. నేనే భేషజాలు పక్కకు పెట్టి గిన్నెనందుకుని ప్రసన్నకిచ్చాను.

పిల్లలు కూడా మమ్మీ ఆ అన్నం పెడితే బాగుండునని చూస్తున్నారు. పిల్లల ముఖాలు చూసి ఏమనుకుందో గబగబా ఆ మజ్జిగ అన్నం కలిపి వాళ్ల నోటిలో పెట్టింది. పిల్లలిద్దరూ ఎన్నాళ్ల నుంచో అన్నం ముఖం చూడని వాళ్లలా ఆత్రంగా తిన్నారు.

వాళ్లిద్దరికీ పెట్టి చెయ్యి కడుక్కురావడానికి లేస్తూ గబుక్కున వళ్లు తూలి పడిపోతూ నా భుజం పట్టుకుంది ప్రసన్న. నీరసంతో స్పృహ తప్పేలా కళ్లు తేలేస్తోంది. ఎదురావిడ గబగబా ఇంత అన్నం గిన్నెలో పెట్టి, పచ్చడేసి ఇచ్చింది. ఎటూ చూడకుండా ఆ అన్నం గబగబా తినేసి చెయ్యికడుక్కుంది. పిల్లలు ఆకలి తీరడంతో అప్పుడే ముఖాలు తేటబడి నిద్రపోయారు. కడుపులోకి అన్నం వెళ్లడంతో ప్రసన్న ముఖం ప్రసన్న ముఖం అయింది.

"అందరూ తిన్నారు సామీ! మీరు కూడా తినండి" అని, వద్దంటుంటే బలవంతాన నా చేతిలో అన్నం గిన్నె వుంచాడు ఆ రైతన్న. అన్నం పరబ్రహ్మ స్వరూపం చేతిలో పెట్టినదాన్ని నిరాకరించలేదు. భారతదేశమే బంగారు భూమి అంటే- ఆంధ్రదేశమంటే అన్నపూర్ణే కదా! ఆకలి తీర్చిన ఆ తల్లి అన్నపూర్ణలా కనిపించింది నా కళ్లకి.

అప్పటి వరకూ ఎంగిళ్లని ఏవగించుకున్న మా ఆవిడ మనస్సులో మార్పు కలిగిందన్న సూచనగా తన హేండ్‌బాగ్‌లోంచి వంద రూపాయలు తీసి పడుకున్న వాళ్ల చంటివాడి చేతిలో వుంచింది. తన భుజాల చుట్టూ వున్న ఖరీదైన షాల్ తీసి, కాళ్ల దగ్గర కింద పాత దుప్పటి ముక్కమీద ముడుచుకుపడుకున్న వాడికి కప్పింది.

వాళ్లిద్దరూ "ఎందుకు తల్లీ ఇవి మాకు. ఆకలిగొన్న వాళ్లకి మా దగ్గర వుంది కాబట్టి ఇంత అన్నం పెట్టాము. ఇందులో మేము చేసిందేముంది? తల్లీ మాలాంటి వాళ్ల దగ్గర మీరు తిన్నారు. మారాజులు మీరు, మా తిండి మీకు ఏపాటిది సామీ" అంటూ ఇచ్చినవి తిరిగి ఇవ్వబోయారు.

"లేదు, లేదు. ఈ రోజు నేను జీవితంలో మర్చిపోని రోజు. పట్టణ ప్రజల మధ్యే తిరిగిన నాకు, ఈ సహజ వాతావరణంలో మీ వంటి మనుష్యుల మధ్య గడిపిన ఈ క్షణాలు నాకు మర్చిపోలేనివి, మరపురానివి" మనస్ఫూర్తిగా అంటున్న ప్రసన్న మాటలకి నేను నిజంగానే అంటున్నావా' అంటున్నట్టు తననేను చూసాను. నిజమే సుమా అన్నట్టు మా రైలు పెద్ద కూత పెట్టి ముందుకు కదిలింది.

★